హడలెత్తిస్తున్న కుక్కలు

- ఏ వీధి చూసినా శునకాలే
- వృద్ధులు, చిన్నారులపై దాడులకు పాల్పడుతున్న వైనం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- అందుబాటులో వ్యాక్సిన్లు



పట్టణంలోని ఓ వీధిలో కుక్కల గుంపు

ఆత్మకూరు : పట్టణంలోని 24 వార్డుల్లోని ఏ వీధిలో చూసినా కుక్కలే. వెంటబడి మరీ కరుస్తుండటంతో కొన్ని కాలనీల ప్రజలు ఇళ్లనుంచి రావాలంటే జడుసుకుంటున్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 2 వేలకు పైగా వీధి కుక్కలు సంచరిస్తున్నట్లు అంచనా. కుక్కల బెడద నుంచి నివారించాలని ప్రజలు మున్సిపల్ అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

కౌన్సిల్ సమావేశంలో చర్చించినా ఫలితం శూన్యం

ప్రధానంగా పట్టణంలో కొత్తపేట, వాకిలిపేట, ఎస్పీ జీపాలెం, ఏబీయం పాలెం, ఇందిరానగర్, అర్బన్‌కాలనీ, వెంగళరెడ్డినగర్, రహమత్‌నగర్ , ఏకలవ్యనగర్ ,సాయిబాబనగర్, మెయిన్ బజార్, తదితర కాలనీల్లో కుక్కలు అధికంగా సంచరిస్తున్నాయి. ఆత్మకూరు మున్సిపాల్‌టీ పరిధిలో కుక్కల బెడద అధికంగా ఉందని, మూడు నెలల క్రితం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ప్రధానాంశంగా చర్చించారు. ఆ సమావేశంలో మున్సిపల్ అధికారులు కుక్కల బెడద నుంచి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే ఇచ్చిన హామీ నేటికీ అమలుకు నోచుకోలేదు. ఇటీవల కుక్కలు అధికం కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటికి వెళ్లిన వారు సురక్షితంగా వస్తారా లేదా అని ఆందోళన నెలకొంది.

వెంబడిస్తున్న శునకాలు

బైకులు, సైకిళ్లు వేసుకుని వెళ్లినా వాటి వెంట కుక్కలు పడుతున్నాయి. గత వారం రోజుల్లో పట్టణంలోని పలు ప్రాంతాల్లో కుక్కలు వెంబడించడంతో 15 మందికి పైగా బైకులపై నుంచి కింద పడి గాయాలపాలయ్యారు. ఈ నెలలో ఇప్పటి వరకు ఐదుగురు కుక్క కాటుకు గురయ్యారు. గత రెండు నెలల్లో దాదాపు 20 మందికి పైగానే కుక్కల కాటు బారిన పడి ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. గతంలో ఇంటి నుంచి తినుబండారాల కోసం దుకాణానికి వెళ్లిన ఓ చిన్నారిని తీవ్రంగా కుక్కలు గాయపరిచిన ఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యింది. దీంతో చిన్న పిల్లలను బయటకి పంపేందుకు తల్లిదండ్రులు జంకుతున్నారు. ఇటీవల కుక్కలు వీధులతోపాటు జనావాసాలు అధికంగా ఉన్న పాతబస్టాండ్, కొత్తపేట మసీదు, నంద్యాల టర్నింగ్, లాంటి ప్రాంతాల్లో కూడా సంచరిస్తూ ప్రజలను కాటువేస్తుడటంతో పట్టణ వాసులు ఆందోళన గురవుతున్నారు.

వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి



ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో రెబిస్ (కుక్కల ఇంజక్షన్) అందుబాటులో ఉన్నాయి. కుక్క కాటుకు గురైన వారికి వైద్యశాలలోనే వ్యాక్సిన్లు వేస్తున్నాం. ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లో కుక్కకాటుకు గురైన వారికి కూడా ఇక్కడే వ్యాక్సిన్లు అందిస్తున్నాం. కుక్కకాటుకు గురైన వారు తప్పకుండా టీకా వేయించుకోవాలి, లేకపోతే రాబిస్ వ్యాధిబారిన పడే ప్రమాదం ఉంది. – రాయుడు, వైద్యాధికారి, ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాల

బయటకు రావాలంటేనే భయమేస్తుంది



పట్టణంలో కుక్కలు అధికంగా ఉండడం వలన ప్రజలు భయాందోళనలకు గురవుతున్నాం. ఏ వీధిలో చూసినా కుక్కల సంచారం అధికమైంది. ప్రధాన కూడళ్లలో కూడా అధికంగా ఉన్నాయి. ఎప్పుడు కుక్కలు కాటువేస్తాయోనని ఆందోళనకు గురవుతున్నాం. అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాల్సిన అవసరం ఉంది. – బాషా, ఆత్మకూరు

చర్యలు తీసుకుంటున్నాం



పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉన్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. కుక్కల బెడద నివారణకు నంద్యాల అధికారులతో చర్చించి, త్వరలోనే కుక్కలను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటాం. అవసరం అయితే పశువైద్యశాల అధికారులతో చర్చించి కుక్కలకు కటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడంతో పాటు రాబిస్ టీకాలు వేయిస్తాం. – శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

పట్టణంలో విచ్చలవిడిగా కుక్కలు సంచరిస్తూ వృద్ధులు, చిన్నారులను కాటువేస్తున్నా మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు , మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్‌ను కలిసి పలు కాలనీ ప్రజలు కుక్కల బెడద నుంచి రక్షించమని వినతిపత్రాలు అందిస్తున్నారు. అయినప్పటికీ అధికారుల నుంచి స్పందన కరువైంది. ఇటీవల పలు కాలనీల్లో కొన్ని పిచ్చి కుక్కలు మనుషుల వెంట పడి మరీ కాటు వేస్తుండటంతో ప్రజలు గాయాలపాలవుతున్నారు.

క్లుప్తంగా

రైతులు సరైన ధ్రువపత్రాలు ఇవ్వాలి

కొత్తపల్లి: కల్వకుర్తి–నంద్యాల జాతీయ రహదారి 167 కే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు వారి పొలాలకు సంబంధించిన అన్ని సరైన ధ్రువపత్రాలు ఇవ్వాలని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ శనివారం తెలిపారు. మండలంలోని సిద్ధేశ్వరం, ఎర్రమఠం, ముసలిమడుగు, గుమ్మడాపురం, శివపురం, గోకవరం, దుద్యాల గ్రామాలలో ప్రభుత్వ, ప్రైవేటు భూములు ఎన్‌హెచ్ 167 కే నిర్మాణంలో భాగంగా సుమారు 292 ఎకరాలు కోల్పోతున్నారని చెప్పారు. ఇందులో 500 మంది రైతులు ఉన్నారని వీరిలో 350 మంది రైతులు మాత్రమే వారి పొలాలకు చెందిన పత్రాలను అందజేశారని వివరించారు. వీటిలో సరైన ఆధారాలు లేని కొన్నింటిని జిల్లా జాయింట్ కలెక్టర్ తిరస్కరించారన్నారు.

వైభవంగా గురుపీఠాహోరణ కార్యక్రమం



పీఠాన్ని అధిరోహించిన అమ్మ నీదయ అశ్రమ పీఠాధిపతి అశోక్‌గురూజీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల పుణ్యక్షేత్రంలో అమ్మ నీదయ ఆశ్రమ ట్రస్ట్ పీఠాధిపతిగా అశోక్ గురూజీ గురుపీఠారోహణ కార్యక్రమానాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. శ్రీశైలం కొత్తపేట సమీపంలోని అమ్మ నీదయ ఆశ్రమంలో అధ్యక్షుడు నర్సిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా ప్రత్యేక హోమాది కార్యక్రమాలను నిర్వహించి, పంచద్రవ్య ప్రాశన చేసి, గురు పూజ కార్యక్రమాన్ని నిర్వహించి అశోక్ గురూజీని ముఖద్వారం నుంచి మహాస్వాగతంతో అశ్రమంలోకి తీసుకొచ్చారు. అశ్రమం తరపున మహాలయ అమావాస్యను పురస్కరించుకుని శ్రీశైలంలోని ఆశ్రమంలో వేదఘోష, పుణ్యాహవాచనం, గణపతి హోమం, మహారుద్ర హోమం, పాశుపత హోమం, శ్రీగురుహోమం చేపట్టారు. ఈ సందర్భంగా అశ్రమంలో ఉచితంగా పితృతర్పణాలు, హోమక్రతువులు, సాధువులకు వస్త్ర, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు.

శ్రీ బరకసంజీవరాయుడికి ప్రత్యేక పూజలు



మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరకసంజీవరాయ స్వామికి శనివారం అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, ఆకుపూజ, మన్యసూక్త హోమం, పల్లకీసేవా తదితర విశేష పూజలను నరహరి శర్మ, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. బీకే సింగ్ అండ్ బిల్డర్స్, అగ్రసేని హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పేరెడ్డి మురళీమోహన్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయుడు రాఘన్న

నందికొట్కూరు రూరల్: మండలపరిధిలోని బొల్లవరం గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రాఘన్న శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని శశికళ, 7వ తరగతి విద్యార్థి ఆనంద్ రాజు అనే విద్యార్థులు అండర్ –14 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

సంగమేశ్వరంలో పితృదేవతలకు పూజలు



పిండప్రదాన పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలోని కృష్ణాతీరంలో వెలసిన సంగమేశ్వరంలోని ఉమామహేశ్వరాలయంలో భక్తులు శనివారం ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ఆధ్వర్యంలో పితృదేవతలకు పూజలు నిర్వహించుకున్నారు. కొన్ని సంవత్సరాలకు ఒక సారి వచ్చే మహాలయ అమావాస్య కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అక్కడికి చేరుకొని పితృదేవతలకు ప్రీతిగా పిండ ప్రదాన కార్యక్రమాలు చేసి కృష్ణానదిలో పూజలు చేసుకున్నారు.

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రులు



వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి అమ్మవారు

నందికొట్కూరు: ఈ నెల 25వ తేదీ నుంచి దేవీ శరన్నవరాత్రుల మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయ కమిటి సభ్యులు సత్యనారాయణ, రామమూర్తి, సుబ్రమణ్యం, నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ప్రతి రోజు దేవాతామూర్తులకు తెల్లవారుజామున 5 గంటల నుంచి అభిషేకం, విశేష పూజ, కలశపూజతో పాటు సాధారణ పూజలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అమ్మవారిని ప్రతిరోజూ ఒక అలంకరణలో పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

జూపాడుబంగ్లాలో..

జూపాడుబంగ్లా: దుర్గాష్టమిని పురస్కరించుకొని మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా, పారుమంచాల, తూడిచెర్ల గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి తొమ్మిదిరోజుల పాటు ప్రత్యేక పూజాధికార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. ఆదివారం ప్రారంభమై ఈనెల 23 నాటికి ఉత్సవాలు ముగుస్తాయని అర్చకులు పేర్కొంటున్నారు.

ఆత్మకూరులో దసరా మహోత్సవాలు

ఆత్మకూరు: దసరా నవరాత్రుల్లో భాగంగా ఆత్మకూరు పట్టణంలో వెలసిన పలు దేవాలయాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో వేడుకలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు వివిధ దేవాలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వడమే కాకుండా విశేషపూజలు ప్రత్యేక అలంకరణలు నిర్వహిస్తారు. ప్రధానంగా పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరి, చౌడేశ్వరి, శ్రీ అంబాభవాని, శివాలయాలు, సాయిబాబ, వెంకటేశ్వర స్వామి, సుంకులమ్మ, శ్రీజంబులమ్మ, శ్రీ ఎల్లమ్మ దేవాలయాల్లో కొలువుదీరిన అమ్మవార్లకు ప్రత్యే క పూజలు నిర్వ హించనున్నారు.

నేటి నుంచి దసరా నవరాత్రులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్‌లోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆదివారం నుంచి దసరా నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ ఆఓపా మహిళా విభాగ్ యువజన విభాగం ఆధ్వర్యంలో నవరాత్రులను నిర్వహిస్తున్నారు. నిత్యం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.



నంది విగ్రహం వద్ద విద్యార్థుల సందడి

మహానంది.. వీకెండ్ సందడి

మహానంది ఆలయంలో శనివారం వీకెండ్ సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల భక్తులతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. దసరా సెలవులు కావడంతో తెలంగాణలోని హైదరాబాద్ నుంచి అధిక సంఖ్యలో వచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు, విద్యార్థులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం విద్యార్థులు ఆలయ ప్రాంగణంలోని నంది విగ్రహం వద్ద సందడి చేస్తూ ఫొటోలు తీసుకుంటూ ఆనందించారు. – మహానంది

కేసీ కాలువ గట్టుకు రంధ్రం



కేసీ కాలువ గట్టుపై ప్రమాదకరంగా ఉన్న భారీ రంధ్రం

పగిడ్యాల: ఆయకట్టు రైతులకు వరదాయిని అయిన కేసీ కాలువ పరిస్థితి రాను రాను ప్రశ్నార్థకంగా తయారవుతోందని కేసీ పరివాహక గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. పగిడ్యాల సమీపంలోని 90 స్లూయిస్ నుంచి పడమర ప్రాతకోట 91 స్లూయిస్ మధ్య కాలువ గట్టుకు భారీ రంధ్రం ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. నిత్యం కేసీ కాలువ గట్టుపై పంటపొలాలకు వెళ్లే రైతులు, టూ వీలర్ వాహన చోదకులు రంధ్రాన్ని గమనించకుండా ప్రమాదాల బారినపడుతున్నారు. వాహనాలు దగ్గరికి వచ్చేవరకూ గట్టుపై ఏర్పడిన భారీ రంధ్రం కనబడదు. దీంతో దానిని గమనించడానికి కొందరు రాళ్లు పెట్టారు. అలాగే కేసీ కాలువ లైనింగ్ దెబ్బతిని కాలువ గట్టు కోతకు గురవుతున్నా సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయకట్టు రైతాంగం ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు చోటుచేసుకోక ముందే నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి కాలువ గట్టుపై ఏర్పడిన రంధ్రాన్ని మట్టితో పూడ్చి వేయించాలని రైతులు కోరుతున్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: దసరా ఉత్సవాలను భక్తులు ప్రశాంతంగా జరుపుకోవాలని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన దసరా ఉత్సవ కమిటీ సమావేశానికి ఆలయాల ధర్మకర్తలు, ఆలయాల కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ దసరా పండుగను ఈ నెల 23వ తేదీన జరుపుకోవాలన్నారు. దసరా పండుగ రోజు జమ్మిచెట్టు (శమీ వృక్షం) వద్దకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు నాగసత్యానారాయణ, శ్రీను, శ్రీకాంత్, రాజు, సుధాకర్‌రెడ్డి, విజ్జి, జయరాం, కృష్ణమూర్తి, బచ్చు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తూడిచెర్ల సబ్‌ఛానల్‌కు 420 క్యూసెక్కుల నీరు

జూపాడుబంగ్లా: తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 420క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుంకేసుల డ్యాం, మల్యాల, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాల ద్వారా కేసీ కాల్వకు 1,047 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతున్నాయన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి సుంకేసుల డ్యాంలోకి నీటి ప్రవాహం నిలిచిపోగా ప్రస్తుతం 1.2 టీఎంసీల నీటిమట్టం ఉందన్నారు. డ్యాం నుంచి 400 క్యూసెక్కులు, మల్యాల నుంచి 337, ముచ్చుమర్రి నుంచి 240 క్యూసెక్కుల నీటిని కేసీ కాల్వకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని రైతులు వినియోగించుకున్న అనంతరం లాకిన్స్‌లా వరకు 420క్యూసెక్కుల నీరు చేరుతుందని చెప్పారు.

ప్రతి ఇంటా 'జగనన్న ఆరోగ్య సురక్ష '

ఆత్మకూరు: పట్టణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీ వరకు పట్టణంలో కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రతి వైద్యాధికారి తప్పనిసరిగా వైద్య శిబిరాలకు హాజరుకావాలన్నారు. శిబిరంలో డయాబెటిక్స్, బీపీ, మలేరియా, డెంగీ, హెచ్ఐవీ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రత్యేక డాక్టర్ల ఆధ్వర్యంలో ఈ నెల 15న, 17 పట్టణంలోని మార్కెట్‌యార్డ్ వద్ద, ఈ నెల 20న పద్మావతి హైస్కూల్, 22న, 24, 27వ తేదీల్లో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో, 29న నారాయణ విద్యావిహార్ హైస్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిబిరాలకు వెళ్లలేని వారికి వైద్యులే ఇంటి వద్దకు వచ్చి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పచ్చదనం కనువిందు



వీరాపురం సమీపంలో కనుచూపుమేర పచ్చదనంతో వరిపొలాలు

కొత్తపల్లి: మండలంలో ఎటు చూసినా పైర్లు కళకళలాడుతున్నాయి. కనుచూపుమేరలో పచ్చదనమే కనువిందు చేస్తోంది. మండలంలో మొక్కజొన్న, పత్తి, ఉల్లి, మునగ, మిరప, కంది, వంటి పంటలను సాగు చేసుకున్నారు. 8,296 హెక్టార్ల సాధారణ సాగు భూమి ఉండగా అత్యధికంగా మొక్కజొన్న 6,237 హెక్టార్లు, పత్తి 1,041 హెక్టార్లు సాగుచేయగా ఆ తర్వాతి స్థానంలో ఉన్న పంట వరి. మండలంలో వరి పంటను కొత్తపల్లి, గువ్వలకుంట్ల, శివపురం, నందికుంట, గుమ్మడాపురం గ్రామాలలో సుమారు 984 హెక్టార్లలో వేశారు. కాగా ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని చెరువులు, బావులు, కుంటలతో పాటు శివభాష్యం సాగర్ ప్రాజెక్ట్ కూడా పూర్తిస్థాయిలో నిండింది. ప్రాజెక్ట్ నుంచి వరి పొలాలకు నీటి విడుదల కొనసాగుతోంది. దీంతో వరిపంటలకు పుష్కలంగా నీరు అందడంతో కనుచూపుమేర పచ్చదనం కనువిందుచేస్తుంది. ఎటువైపుకు చూసిన వరిపైరు కళకళలాడుతూ చూపరులకు అహ్లాదాన్ని కలిగిస్తోంది. రైతుల కళ్లల్లో ఆనందం వెల్లువిరుస్తోంది.

రేపు ఎమ్మెల్యే శిల్పా పర్యటన

ఆత్మకూరు: స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సోమవారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్ మీర్, రాజమోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఈ నెల 16న మండలంలోని బాపనంతపురం గ్రామంలో నూతన సచివాలయం , రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తారన్నారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమానికి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

పొలం రస్తా పునరుద్ధరణ



పొలాలకు వెళ్లే రహదారిని పరిశీలిస్తున్న ఎస్ఐ ఓబులేసు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని శాతనకోట గ్రామంలోని అర్మను తూము నుంచి నీటి ముంపు పొలాలకు వెళ్లే దారిని, కల్వర్టును గ్రామానికి చెందిన నాగశేషులు, సాంబశివుడు అనే వ్యక్తులు తొలగించారు. దీంతో గ్రామానికి చెందిన రైతులు కొందరూ తమకు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ ఓబులేసుకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఎస్ఐ శాతన కోట గ్రామ సర్పంచ్ జనార్దన్ గౌడుతో కలిసి గ్రామానికి వెళ్లి రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. పొలాలకు వెళ్లే రహదారిని పునరుద్ధరించారు.

దసరా ఉత్సవాలకు రండి



ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డికి ఆహ్వానపత్రిక అందిస్తున్న ఈఓ, చైర్మన్



ఎస్పీ రఘువీర్‌రెడ్డికి ఆహ్వానపత్రిక ఇస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో ఆదివారం నుంచి తొమ్మిది రోజుల పాటు వైభవంగా జరిగే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు రావాలని కోరుతూ నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డితో పాటు అధికారులకు ఆలయ అధికారులు ఆహ్వానపత్రికలు అందించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, పండితులు శనివారం నంద్యాలలో ఎస్పీ రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డిలను కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు వారికి ఆశీర్వచనాలు అందించి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

పోతిరెడ్డిపాడు నుంచి కొనసాగుతున్న నీటిసరఫరా



పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ఐదు గేట్ల ద్వారా ఎస్సారెమ్సీ కాల్వలోకి వెళ్తున్న నీరు

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ఐదుగేట్ల ద్వారా 1,500 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం జలాశయంలో సాయంత్రం ఆరుగంటల సమయంలో 848.80 అడుగుల నీటిమట్టం ఉండగా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద 847.80 అడుగులుగా ఉందని చెప్పారు. హెడ్‌రెగ్యులేటర్ ఐదుగేట్ల ద్వారా 1,500 క్యూసెక్కుల నీరు ఎస్సారెమ్సీ కాల్వలోకి వెళ్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని బానకచర్ల నీటిని యంత్రణ వ్యవస్థ నుంచి గాలేరునగరి సుజలశ్రవంతి (ఎస్సార్బీసీ)కాల్వకు 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తెలుగుగంగ, కేసీ ఎస్కేప్ కాల్వకు సాగునీటి సరఫరా నిలిపివేసినట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు.

21.1861టీఎంసీల నీటి వినియోగం

ఇప్పటిదాకా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా కేవలం 21.1861టీఎంసీల నీటిని మాత్రమే దిగువనున్న ఆయకట్టుకు వినియోగించుకున్నట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. ఇందులో తెలుగు గంగ కాల్వకు 10.5236టీఎంసీలు, కేసీఎస్కేప్ కాల్వకు 2.1423 టీఎంసీలు, ఎస్సార్బీసీకి 8.5202 టీఎంసీల నీటిని సరఫరా చేసినట్లు వెల్లడించారు.



మహానందిలో విద్యుద్దీపాలంకరణ



బుక్కాపురంలో విద్యుత్ దీపాలంకరణలో అమ్మవారు

దసరా కాంతులు

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంతో పాటు పల్లెల్లో దసరా కాంతులు విరాజిల్లుతున్నాయి. దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహానంది ఆలయంలో గోపురాలకు, సుపథ మండపాలకు విద్యుద్దీపాలంకరణ చేశారు. బుక్కాపురం గ్రామంలో యూత్ నాయకుల ఆధ్వర్యంలో రామాలయం, శివాలయం, కాశినాయన ఆలయం పరిసరాలను అందంగా అలంకరించారు. విద్యుత్ దీపాలతో చేసిన అమ్మవారి చిత్రం భక్తులను ఆకట్టుకుంటుంది.

